ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సచివాలయంలో నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ బేరీతో సమావేశమయ్యారు.
- కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి పధంలో ముందుకు వెళుతోందని చిత్తూరు పార్లమెంట్ సభ్యుడు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు.
- సవాళ్ళను సమర్ధవంతంగా ఎదుర్కొని ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ఇంటర్మీడియట్ హాల్‌టికెట్లను వాట్సప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

==================

వన్ ఫ్యామిలీ - వన్ ఏఐ ప్రొఫెషనల్ - వన్ ఎంట్రప్రెన్యూవర్ గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ బేరీ ఈరోజు రాష్ట్ర సచివాలయానికి వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్రంలో ఉన్న అవకాశాలను, అభివృద్ధి ఆకాంక్షలను ఆయనకు తెలియజేశారు. ఇదే లక్ష్యంగా స్వర్ణాంధ్ర – 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించామని, దీనికి కేంద్ర ప్రభుత్వం సాయం అవసరమని చెప్పారు. రాష్ట్రం ప్రతీ సంవత్సరం 15 శాతం వృద్ధిరేటు సాధించి 2047 కల్లా 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరేందుకు, తద్వారా 42 వేల డాలర్ల తలసరి ఆదాయానికి అందరూ చేరుకునేలా ప్రయత్నిస్తున్నట్టు ముఖ్యమంత్రి వివరించారు. కాగా.. కేంద్రానికి – రాష్ట్రానికి ఇది అనుకూల సమయమని, అభివృద్ధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, ఇందులో నీతి ఆయోగ్ భాగస్వామ్యం కూడా తప్పక ఉంటుందని సుమన్ బేరీ తెలియజేశారు.

==================

కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రగతి పధంలో పురోగమిస్తోందని చిత్తూరు పార్లమెంట్ సభ్యుడు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. ఈరోజు ఆయన లోక్ సభలో మాట్లాడుతూ.. వికసిత్ భారత్ బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ బడ్జెట్‌తో దేశం స్థిరమైన అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రకటించిన ప్యాకేజీతో విశాఖ ఉక్కు పరిశ్రమకు పునరుజ్జీవం వచ్చిందని అన్నారు. కేంద్ర సహకారంతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమర్ధవంతమైన పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ పురోగమిస్తోందన్నారు. అలాగే.. అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ప్రకటన వంటి అంశాలు రాష్ట్ర ప్రగతికి ఎంతగానో దోహదపడతాయని పేర్కొంటూ..

(వాయిస్ బైట్..42 సెకన్లు)-net

==================

ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్, అన్న క్యాంటీన్లు వంటి పథకాలతో సంక్షేమం అమలు చేస్తూనే.. మరోవైపు మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల సాధనతో అభివృద్ధివైపు పయనిస్తున్నామని చెప్పారు. సవాళ్లను సమర్ధవంతంగా ఎదుర్కొని సుపరిపాలనతో ఎన్నికల హామీలను అమలు చేస్తామని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని వివరించారు. అయితే ఈ లక్ష్యాలను వేగంగా చేరుకోవాలంటే ప్రభుత్వంలో ఉన్న ప్రతి ఒక్కరూ కష్టపడాలని, అందరూ కలిసి పనిచేసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

==================

దశలవారీగా ప్లాస్టిక్ ను నిర్మూలించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా హైదరాబాద్ ఏ.ఐ. టెక్నాలజీ సంస్థ తయారు చేసిన బయో ఎలైట్ ఉత్పత్తుల ప్రదర్శనను ఆమె, కంపెనీ ప్రతినిధులతో కలిసి సందర్శించారు. మంచినీళ్ళ బాటిల్, గ్లాస్, స్ట్రా, క్యారీ బ్యాగులు, ప్యాకింగ్ డబ్బాలు, భోజనం ప్లేట్లు మొదలైన వాటిని, మొక్కజొన్న కండి లోపలి భాగాన్ని ఉపయోగించి తయారు చేసినట్టు సంస్థ ప్రతినిధి తెలిపారు. ఈ ఉత్పత్తులన్నీ 4 నుండి 5 నెలల్లో భూమిలో డీ కంపోజ్ అవుతాయన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దశలవారీగా ప్లాస్టిక్ స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువులు వినియోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 1 నుండి భీమవరం పట్టణంలోని అన్ని స్టాల్స్, షాపుల్లో ప్లాస్టిక్ టీ గ్లాసులు, బ్యాగులు నిషేధించామని తెలిపారు.

===================

విరామం

===================

ఇంటర్మీడియట్ పరీక్షల హాల్‌టికెట్లను వాట్సాప్ గవర్నెన్స్‌లో అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులు వాట్సాప్ ద్వారా నేటి నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించింది. ఫీజులు చెల్లించలేదని ప్రైవేటు కాలేజీలు హాల్‌టికెట్లు జారీ చేయకపోవడం వంటివి జరగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 10 లక్షలకు పైగా విద్యార్థులు ఉన్నారు. వాట్సాప్ నంబరు 9552300009 ద్వారా వారంతా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు.

===================

రాష్ట్ర పారిశ్రామిక శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (MSME) సర్వేను వేగవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. ఇబ్రహీంపట్నంలో గ్రామ సచివాలయ సిబ్బంది చేస్తున్న ఎంఎస్ఎంఈ సర్వే కార్యకలాపాలను ఈరోజు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీతత్వ, ఆరోగ్యకర పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థను పెంపొందించే లక్ష్యంతో ఈ సర్వేను చేపట్టడం జరిగిందని తెలిపారు.

===================

శుద్ధి చేసిన వ్యర్థాల నుండి తయారుచేసే గ్యాస్ ప్లాంట్ లు నెలకొల్పేందుకు అనువైన స్థలాలను గుర్తించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ఈరోజు ఆయన జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి జిల్లాలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ల ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద జీవ ఇంధన ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలను తీసుకువచ్చిందన్నారు. రిలయన్స్ సంస్థ ద్వారా ఇంటిగ్రేటెడ్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటుకు ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు.

===================

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి ఈరోజు మరో నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. పీఆర్టీయూ మద్దతుతో బరిలోకి దిగిన మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, స్వతంత్ర అభ్యర్థులు నూకల సూర్యప్రకాష్, రాయల సత్యన్నారాయణ, పోతల దుర్గారావులు ఈరోజు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కు సంబంధిత పత్రాలను అందజేశారు. అభ్యర్థులందరిచేతా కలెక్టర్ ప్రమాణం చేయించారు.

===================

స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికలో భాగంగా పేదరిక నిర్మూలనకు పి4 విధానంతో కార్యాచరణ రూపొందించాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు, జిల్లా అధికారులు, ఎంపిడిఓలతో ఆయన ఈరోజు దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఉగాది పర్వదినం రోజున ముఖ్యమంత్రి ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని, దీనికి అందరు సమాయత్తం కావాలని కోరారు. స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళికలో భాగంగా నియోజకవర్గాల వారీగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలన్నారు.

===================

పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ఉపాధ్యాయులకు సూచించారు. రానున్న 30 రోజులు అత్యంత కీలక సమయమని.. వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధపెట్టి నూరు శాతం ఫలితాలు సాధించేందుకు కృషిచేయాలని ఆదేశించారు. ఇబ్రహీంపట్నం మూలపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 17వ తేదీ నుండి పదవ తరగతి పరీక్షలు మొదలవుతాయని, సుమారు 40 రోజులు వ్యవధి మాత్రమే ఉందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై దృష్టిపెట్టి ఉత్తమ ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు.

===================

ప్రపంచంలో భారత్ శక్తివంతమైన దేశంగాను, ఆధ్యాత్మిక కేంద్రంగాను నిలుస్తుందని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా కోస్ట గ్రామం గోకులనంద ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన వివిధ దేవతా విగ్రహాలను ఎచ్చెర్ల శాసనసభ్యులు ఎన్. ఈశ్వరరావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ఒకనాడు ప్రపంచానికి శాంతి సందేశం అందించిన భారత్ నేడు ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోందన్నారు. దేశ ప్రజలే కాక, ప్రపంచ వ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని విశ్వగురువుగా కొనయాడుతున్నారని, ఇది ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. హైందవ ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి మోడీ అని కొనియాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం.. దేశంలో మోడీ సారధ్యంలో NDA ప్రభుత్వం జనరంజక పాలన అందిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

===================

పార్వతీపురం మన్యం జిల్లాను దేశంలో అగ్రగామిగా నిలపాలని, ఆశావాహ జిల్లాల విభాగంలో ప్రధానమంత్రి అవార్డు రావాలని కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఆకాంక్షించారు. ఈరోజు ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గత త్రైమాసికంలో భామిని బ్లాక్ దక్షిణ భారతదేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, ఇదే స్ఫూర్తిని జిల్లాలోనూ కొనసాగించాలని అన్నారు.

===================
===================